క్లుప్తంగా

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు



మాట్లాడుతున్న ఎస్సై శ్రీనివాస్ యాదవ్

చిగురుమామిడి: మండలంలోని రామంచ గ్రామంలో మోయతుమ్మెద వాగు నుంచి ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎస్ శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బుధవారం గ్రామంలోని ట్రాక్టర్ యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అధికారుల అనుమతి లేకుండా, ఓటీపీ రాకుండా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. కొన్ని రోజుల నుంచి ఇసుక రవాణాపై నిఘా పెడుతున్నామని అన్నారు. సమావేశంలో ప్రొబేషనరీ ఎస్సై జగదీశ్, పోలీసు సిబ్బంది, ట్రాక్టర్ యజమానులు పాల్గొన్నారు.

అక్రమ మట్టి తవ్వకాలపై చర్యలు తీసుకోవాలి

జమ్మికుంట: మండలంలోని తనుగుల గ్రామంలోని చాకిరికుంట, అంకుషావలికుంట చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల సహాయ కార్యదర్శి వడ్లూరి కిషోర్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో మాట్లాడారు. ఎస్సారెస్పీ ఏఈ అధికారికి ఫిర్యాదు చేయగా జేసీబీ, ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేశారని చెబుతున్నా మట్టి తవ్వకాలు ఆగడం లేదని ఆరోపించారు. చెరువుల్లో లోతుగా తవ్వకాలు జరపడం వల్ల మూగజీవులు నీళ్లు తాగడానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, మనుషులు గుంతల్లో పడి చనిపోయే అవకాశాలు ఉన్నాయన్నారు. స్థానిక అధికారుల అండదండలతో మట్టి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయని, కలెక్టర్, ఎస్సారెస్పీ అధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

సీబీఎస్‌ఈ ఫలితాల్లో సెయింట్ జార్జి విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న సెయింట్ జార్జి స్కూల్ యాజమాన్యం

కరీంనగర్: కొత్తపల్లిలోని సెయింట్ జార్జి ఇంటర్నేషనల్ పాఠశాల (సీబీఎస్‌ఈ) పదోతరగతి ఫలితాల్లో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అర్హాన్ (486/500), నేహశ్రీ (477/500), హన్సిక్ (475/500) మార్కులతో మొదటి మూడు స్థానాలలో నిలిచారు. 400పైగా మార్కులతో 26 మంది ఉత్తీర్ణత సాధించారు. తెలుగులో యమున 100/100 మార్కులు, అర్హాన్ సైన్స్‌లో 100/100 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా సెయింట్ జార్జి, ప్యారడైజ్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ పి.ఫాతిమారెడ్డి ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించారు.

అమెరికాలో వసంత్ పంచ్‌లు

కరీంనగర్‌స్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాలో సీనియర్ కరాటే మాస్టర్, ఒకినోవా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ కె.వసంత్ కుమార్ ఇటీవల అమెరికాలోని డెలావేర్ స్టేట్‌లోని లూయిస్ వెళ్లారు. సీసైడ్ మార్షల్ ఆర్ట్స్ డోజో అకాడమీ చిన్నారులు, కోచ్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. వారికి ఇండియా పంచ్‌ల కోచింగ్ ఇచ్చారు. అక్కడి చిన్నారులను ట్రైన్‌చేశారు.

డీఐఈవోను కలిసిన నరేందర్‌రెడ్డి

కరీంనగర్: ఇటీవల జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి (డీఐఈవో)గా బాధ్యతలు స్వీకరించిన వి.గంగాధర్‌ను వారి కార్యాలయంలో బుధవారం అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, సిబ్బంది ఉన్నారు.

గంజాయి పట్టివేత

కరీంనగర్‌క్రైం: గంజాయి తరలిస్తున్న యువకుడిని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. కరీంనగర్ అర్బన్ స్టేషన్ పరిధిలోని గోదాం గడ్డ ప్రాంతానికి చెందిన తమ్మడి పృథ్వీరాజ్ గంజాయి తరలిస్తుండగా అతని వద్దన నుంచి 425 గ్రాముల గంజాయిని బుధవారం ఎక్సైజ్ సీఐ రాము ఆధ్వర్యంలో పట్టుకున్నారు. బైక్‌ను సీజ్ చేశారు. ఇక్కడ ఎస్సై ఇషాక్ పాషా, హెడ్ కానిస్టేబుల్ శ్రీకాంత్ రెడ్డి, కానిస్టేబుల్స్ మహేశ్, జగన్, రాము, శంకర్ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను సక్రమంగా చేపట్టాలి

కరీంనగర్‌రూరల్: చామన్‌పల్లి జీపీని జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్ తనిఖీ చేశారు. నర్సరీలో జర్మినేషన్ మొక్కల పెంపకం, కంపోస్ట్ ప్రిపరేషన్, వైకుంఠధామాన్ని పరిశీలించారు. వెంట ఎంపీవో జగన్‌మోహన్ రెడ్డి, కార్యదర్శి కే.మహేందర్ రావు, ఫీల్డ్, రికార్డ్ అసిస్టెంట్లు ఆంజనేయులు, సాయిలున్నారు.

సాగుకు వేళాయే.. విత్తనాలు రావాయే

- మరో పదిరోజుల్లో వానాకాలం ప్రారంభం
- జాడలేని జీలుగ, జనుము విత్తనాలు
- భూసారం పెరగడంతోపాటు, అధిక దిగుబడి వస్తుందని రైతుల ఆశ



పచ్చిరొట్టను కలియదున్నుతున్న రైతు(ఫైల్)

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల రైతులు పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుము, అలాగే ఇతర విత్తనాల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి వానాకాలం ప్రారంభం కానుంది, మరోవైపు సబ్సిడీ విత్తనాలు అందుబాటులో లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో అన్నదాతలు విత్తనాల కొనుగోళ్లపై దృష్టి సారించారు. కానీ పచ్చిరొట్ట విత్తనాల ఊసే లేదు. ఈ విత్తనాలను నాటు వేసే నెలరోజుల ముందు పంట పొలాల్లో జల్లడం వల్ల అవి మొలకెత్తుతాయి. సాగుకు ముందు కలియదున్నడం వల్ల పంటకు బలం చేకూరుతుంది. గతంలో మాదిరిగా పశువుల పేడ, ఇతర ఎరువులు గ్రామాల్లో లభించక రసాయన ఎరువులపై ఆధారపడి సాగుచేయడం వల్ల పంట దిగుబడి గణనీయంగా తగ్గిపోతోందని వాపోతున్నారు. జీలుగ, పిల్లిపెసర, పెసర, జనుము విత్తనాలతో దిగుబడి పెరగడంతో పాటు భూసారం పెరిగి రెండు సీజన్లలో భూసారం పెరిగే అవకాశాలుంటాయని ఆయా గ్రామాల రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు వ్యవసాయ అధికారులు సైతం రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. కానీ ప్రభుత్వం విత్తనాలు రైతులకు ముందస్తుగా సరఫరా చేయడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏటా వానాకాలంకు నెల రోజుల ముందుగానే విత్తనాలను రైతులకు అందుబాటులోకి తెచ్చేది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూసారం కోసం ఉపయోగపడే విత్తనాలు సమయానికి రావడంలేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని చిగురుమామిడి మండలంలోని రైతులకు సరిపడా జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలు సరఫరా చేయాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు. మండలంలోని 17 గ్రామాల్లో దాదాపు 13 వేల మంది రైతులున్నారు. వీరిలో 9 వేల మందికిపైగా రైతులు జీలుగ, జనుము విత్తనాలను సాగుచేస్తుంటారు. మిగిలిన రైతులు పత్తి, మొక్కజొన్న పంటలు సాగుచేస్తారు. వానాకాలంలో మాత్రమే రైతులు వీటిని సాగుచేస్తుంటారు. వరి పొలాల్లో బలం కోసం పచ్చిరొట్ట విత్తనాల సాగుచేయడంవల్ల వానాకాలంలో రైతులకు కొంతమేర పెట్టుబడి భారం తగ్గుతుంది. వీటి సాగుతో వరి గొలుసు పెద్దగా పెరగడంతో పాటు దానికి కాచే గింజలు వందల సంఖ్యలో కాస్తుంటాయి. నాణ్యమైన గింజలతో మంచి దిగుబడి వస్తుందని ఆయా గ్రామాల రైతులు చెబుతున్నారు.

రాగానే పంపిణీ చేస్తాం



రైతులకు ఏటా వానాకాలంలో కావాల్సిన జీలుగ, జనుము, పిల్లిపెసర, ఇతర లోకల్ రకం పెసర విత్తనాల కోసం ఇండెంటు పెట్టాం. త్వరలో వస్తాయని అనుకుంటున్నా, చాలా గ్రామాల నుంచి రైతులు ఫోన్‌చేసి అడుగుతున్నారు. విత్తనాలు రాగానే రైతులకు పంపిణీ చేస్తాం.

– రాజులునాయుడు, మండల వ్యవసాయాధికారి, చిగురుమామిడి



చొప్పదండి: భూపాలపట్నం ఎల్లమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

ఆధ్యాత్మికం

భూపాలపట్నంలో ఎల్లమ్మ పట్నాలు

చొప్పదండి: మండలంలోని భూపాలపట్నంలో బుధవారం గీత కార్మికులు ఎల్లమ్మ పట్నాలు వైభవంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి మహిళలు బోనాలతో ర్యాలీగా ఆలయానికి తరలివెళ్లారు. బుధవారం తెల్లవారుజామున అమ్మవారికి మొక్కులు సమర్పించారు. అనంతరం పెద్ద పట్నం నిర్వహించారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొత్తూరి మహేశ్, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, మునిగాల చందు గౌడ్, మునిగాల సుధాకర్‌గౌడ్, పెరుమాండ్ల గంగయ్యగౌడ్, ముద్దం తిరుపతిగౌడ్, తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కన్నాపూర్‌లో హన్‌మాన్ శోభాయాత్ర

శంకరపట్నం: మండలంలోని కన్నాపూర్ గ్రామంలో బుధవారం ఆంజనేయస్వామి మాలధారణ భక్తులు హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. గ్రామవీధుల గుండా శోభాయాత్ర నిర్వహించగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు.

జమ్మికుంటలో..

జమ్మికుంట: పట్టణంలోని శ్రీసంతోషిమాత ఆలయంలో మహా కుంబాభిషేకం, సహిత చండీ యాగం ఉత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. వేద పండితులు కపర్తి శర్మ, ఎలబాక ప్రసాద శర్మ, దుర్గాప్రసాద్ శర్మ, రేవూరి వసంత శర్మ, రతన్ శర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని పట్టు వస్త్రాలతో సుందరంగా అలంకరించి శోభాయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం

మానకొండూర్‌రూరల్: మండలంలో శ్రీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నటరాజ నృత్యాలయం కరీంనగర్ గురువు శుభాన్ ఆధ్వర్యంలో చిన్నారులు మనస్విని, వేధస్విని, రుద్రాణి, మనోజ్ఞ, శాన్వి, గ్రీష్మ చేసిన కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకుంది. ఆలయ కమిటీకి చిన్నారులు కృతజ్ఞతలు తెలిపారు.



శోభాయాత్ర నిర్వహిస్తున్న హనుమాన్ భక్తులు



జమ్మికుంట: సంతోషిమాత శోభాయాత్ర



నృత్యం చేస్తున్న చిన్నారులు

నాటక ప్రదర్శనకు హాజరుకావాలని ఆహ్వానం



కరపత్రం అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

గన్నేరువరం: మండలంలోని గునుకులకొండాపూర్‌లో ఈ నెల 17, 18వ తేదీల్లో జరిగే నల్లపోచమ్మ నాటక ప్రదర్శన కార్యక్రమానికి హాజరుకావాలని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను నల్లపోచమ్మ ఆలయ కమిటీ సభ్యులు కోరారు. బుధవారం రాజన్నసిరిసిల్ల జిల్లా బెజ్జంకి మండలం గుండారంలో రసమయిని కలిసి కరపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు జాగిరి శ్రీనివాస్‌గౌడ్, న్యాలపట్ల శంకర్‌గౌడ్, సాఫ్ట్‌వేరు లింగంపల్లి తిరుపతి, ముఖ్య సలహాదారుడు కొర్వి కొమురయ్య, భక్తులు గొల్లపల్లి బాలయ్య, కొర్వి విజయ్, తదితరులు పాల్గొన్నారు.

పవర్‌లిఫ్టింగ్‌లో ప్రతిభ



పతకాలతో సిరిచందన

గంగాధర: మండలంలోని సర్వారెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధి మర్రిగడ్డ గ్రామానికి చెందిన తూడి సిరిచందన ఏషియన్ సబ్ జూనియర్, జూనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో దేశం తరుపున పాల్గొని పతకాలు సాధించింది. ఈ నెల 6 నుంచి 12వ తేదీ వరకు ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. 52 కేజీల విభాగంలో కాంస్య, రజత పతకాలు సాధించడంతో సిరిచందనను గ్రామస్తులు అభినందించారు.

జమ్మికుంట సీఐగా రామకృష్ణ

కరీంనగర్‌క్రైం: కమిషనరేట్‌లోని జమ్మికుంట సీఐగా ఎస్.రామకృష్ణను నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. జమ్మికుంటలో పనిచేస్తున్న వి.రవిని ఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశాలు వచ్చాయి. మల్టీజోన్ వన్‌లో 11 మంది సీఐలను బదిలీ చేయగా అందులో జమ్మికుంట సీఐ బదిలీ కూడా జరిగింది.

విక్రమ్‌రావు మృతి తీరనిలోటు

కరీంనగర్‌అర్బన్: ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఐఎఫ్‌డబ్ల్యూజే) జాతీయ అధ్యక్షుడు కె.విక్రమ్‌రావు మృతి జర్నలిస్టులకు తీరని లోటని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కుడుతాడి బాపురావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో సంతాప సభ ఏర్పాటు చేసి, విక్రమ్‌రావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. విక్రమ్‌రావు జర్నలిజంలో దాదాపు నలభై ఏళ్లుగా అనేక హోదాల్లో పని చేసి జర్నలిస్టుల హక్కుల కోసం పోరాడారని పేర్కొన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు నల్లగొండ సత్తయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నరేందుల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మృతి

వీణవంక: మండల కేంద్రానికి చెందిన రేపాల ప్రశాంత్(27) చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. పోలీసుల తెలిపిన వివరాలు... కారు డ్రైవర్‌గా పని చేస్తున్న ప్రశాంత్ అప్పుల బాధతో ఈ నెల 12న ఇంట్లో పురుగు మందు తాగాడు. కుటుంబీకులు గమనించి వెంటనే జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ట్రైనీ ఎస్సై సాయికృష్ణ వివరించారు.

జమ్మికుంట: బైక్ పైనుంచి పడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. టౌన్ సీఐ రవి తెలిపిన వివరాలు.. మండలంలోని శాయంపేటకు చెందిన సంపల్లి లింగారావు(59) ఈ నెల 3న జమ్మికుంటలో బైక్‌పై నుంచి పడిపోగా తీవ్ర గాయాలయ్యాయి. వరంగల్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు సంపెల్లి రఘుపతిరావు ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

కేసు నమోదు

జమ్మికుంట: ఇంట్లోకి చొరబడి చోరీకి యత్నించిన ఆరుగురిలో ఒకరిని గుర్తించగా బాధితుడి ఫిర్యాదుతో బుధవారం కేసు నమోదు చేశామని టౌన్ సీఐ రవి తెలిపారు. మండలంలోని మాచనపల్లి గ్రామానికి చెందిన బంగారి సమ్మయ్య మంగళవారం అర్ధరాత్రి వర్షం పడుతున్న సమయంలో పశువులకు గడ్డివేసి, గడ్డిపై కవర్ కప్పి వస్తుండగా ఆరుగురు ఇంట్లోకి చొరబడుతుండగా వారిని చూసి అరవడంతో పారియారు. వారిలో ఒకరు నాలుగు నెలల క్రితం ఇంట్లో ఎలక్ట్రికల్ పనికోసం వచ్చిన పట్టణంలోని మోత్కులగూడెం గ్రామానికి చెందిన ఇత్తం రాజుగా బాధితుడు గుర్తించాడని ఈ మేరకు సమ్మయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని సీఐ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

జమ్మికుంట: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై బుధవారం రాత్రి పట్టణానికి చెందిన ప్రణీత్‌కుమార్ బైక్‌పై వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైనన ప్రణీత్‌కుమార్‌ను స్థానికులు పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు పక్కనే అడ్డా

శంకరపట్నం: కేశవపట్నంలోని పోస్టాఫీస్ ఎదుట మందుబాబులు బుధవారం రాత్రి మద్యం సేవించారు. అంబేద్కర్ చౌరస్తా నుంచి గ్రామానికి వెళ్లే దారిలోని మద్యం దుకాణంతో రాత్రివేళ మహిళలు నడుచుకుంటూ వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. పోలీసులు, ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవాలని మహిళలు కోరుతున్నారు.

అల్పాహారం అందజేత

కరీంనగర్‌టౌన్: రాజరాజేశ్వరి లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ కార్యదర్శి, బీజేపీ నాయకుడు నరహరి లక్ష్మారెడ్డి జన్మదినం సందర్భంగా బుధవారం రాజరాజేశ్వరీ లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రిలో అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో మీల్స్ ఆన్ వీల్స్ కోఆర్డినేటర్స్ రావికంటి కృష్ణకిషోర్, అరికొంత రవీందర్‌రెడ్డి, చాడమల్లారెడ్డి, లంబు రాజి రెడ్డి పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతోనే శాంతి సాధ్యం

విద్యానగర్(కరీంనగర్): ఆధ్యాత్మికతతోనే శాంతి సాధ్యమౌతుందని ట్రస్మా మాజీ అధ్యక్షుడు, ఉమ్మడి రాష్ట్రాల ప్రజ్ఞ చీఫ్ కోఆర్డినేటర్ యాదగిరి శేఖర్ రావు అన్నారు. వికాస తరంగిణి తీగలగుట్టపల్లి శాఖ ఆధ్వర్యంలో చిన్నారులకు నిర్వహిస్తున్న భగవద్గీత ప్రజ్ఞ, వేసవి శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం బుధవారం తీగలగుట్టపల్లిలో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సంస్కృతి, సంప్రదాయాలు, భజనలు, కీర్తనలు, ప్రార్థన శ్లోకాలు, యోగా తదితర అంశాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించగా.. ప్రతిభ చూపిన చిన్నారులకు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. వికాస తరంగిణి చీఫ్ కోఆర్డినేటర్ న్యాలకొండ గౌతమ్‌రావు, జిల్లా కమిటీ సభ్యులు కొలగాని శ్రీనివాస్, పాకాల రామిరెడ్డి, విజేత గ్రీన్ సిటి సెంటర్ కమిటీ సభ్యులు శంకరయ్య, వెంకట్‌రెడ్డి, వాసుదేవరావు, ప్రభాకర్, రాజ్‌కుమార్, అరణి, స్వర్ణలత, లావణ్య, సౌజన్య, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం గ్రామం 3, 4, 5 వార్డుల్లో వారం రోజులుగా వీధిలైట్లు వెలగడం లేదు. దీంతో ఆయా వార్డుల ప్రజలు అంధకారంలో ఇబ్బందులు పడుతున్నారు. వార్డుల్లోని వీధిలైట్లు వెలగడం లేదని గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బందికి పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వానాకాలం ప్రారంభంలో పాములు, విషసర్పాలతో ప్రమాదం పొంచి ఉందని ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
కృష్ణ ప్రసాద్, ఎంపీడీవో, సెల్: 9989930713

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227



చొప్పదండి: సమ్మె పోస్టర్ ఆవిష్కరిస్తున్న హమాలీలు

పోస్టర్ ఆవిష్కరణ

చొప్పదండి: పట్టణంలోని మార్కెట్ చౌరస్తాలో దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ఆవిష్కరించారు. సీఐటీయూ మండల కార్యదర్శి గంగిపెల్లి కుమార్ మాట్లాడుతూ.. హమాలీలు ఈ నెల 20న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. లేబర్ చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్‌గా అమలు చేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సామాజిక భద్రత కల్పించాలని, పాత పెన్షన్ పథకం పునరుద్ధరించాలని, హమాలీలకు ప్రభుత్వమే గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, శేఖర్, రవి, కనకరాజు, భూమయ్య, అంజయ్య, రమేశ్, అశోక్, కనుకయ్య, తిరుపతి పాల్గొన్నారు.

శంకరపట్నం: కేశవపట్నం వ్యవసాయమార్కెట్‌లో బుధవారం సీఐటీయూ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ నెల 20న చేపట్టే దేశ వ్యాప్త సమ్మె కరపత్రాలను కార్మికులు ఆవిష్కరించారు. బస్టాండ్ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ర్యాలీ చేపడతామని జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ తెలిపారు. సమావేశంలో మండల కన్వీనర్ బాబా, సారయ్య, వంగ కోటి, శ్రీకాంత్, భిక్షపతి, వెంకటేశ్, షాకీర్, భూమయ్య, పవన్, నరేశ్, కొమురయ్య, ఐలయ్య, చంద్రయ్య, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



కేశవపట్నంలో...



ఆరుగాలం కష్టం కన్నీటిపాలు

గన్నేరువరం: మండలంలో మంగళవారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి వివిధ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. రెండు రోజులుగా మబ్బులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కుప్పలపై టార్పాలిన్ కవర్లు కప్పినా గాలులకు చెల్లాచెదురవుతున్నాయని వాపోతున్నారు. గన్నేరువరం కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని మళ్లీ ఆరబెడుతున్నారు రైతులు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి

కొత్తపల్లి: సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కరీంనగర్ రూరల్ సీఐ ఏ.నిరంజన్‌రెడ్డి అన్నారు. బుధవారం రేకుర్తిలోని ఢిల్లీ డిఫెన్స్ అకాడమీలో దేశ సైన్యం, వివిధ రక్షణ విభాగాల్లో ఉద్యోగాల ఎంపిక కోసం శిక్షణ పొందుతున్న యువకులతో 'సైబర్ మోసాలు.. మాదక ద్రవ్యాలు.. మత్తు పదార్థాల వినియోగం- దుష్పరిణామాలు' అంశంపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ప్రజలు కష్టపడి సంపాదించి బ్యాంకుల్లో దాచుకున్న డబ్బులను తస్కరించేందుకు సైబర్ నేరగాళ్లు పలు రకాల ఎత్తుగడలతో మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. తమ కుటుంబ సభ్యులు లేదా బంధువులు డిజిటల్ అరెస్ట్ అయ్యారంటూ సైబర్ నేరగాళ్ల బెదిరింపులకు పాల్పడుతున్నారని, చట్టపరంగా డిజిటల్ అరెస్ట్ అనేది ఉండదన్నారు. సైబర్ నేరగాళ్ల డబ్బులను తస్కరిస్తే వెంటనే 1930 నంబర్‌కు చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. అలాగే యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండటం వల్లే లక్ష్యాలను సాధించవచ్చనే విషయాన్ని యువత గుర్తించాలని సూచించారు. ఎస్సై సాంబమూర్తి, శిక్షణ విభాగం ఇన్‌చార్జి సతీశ్‌రెడ్డి పాల్గొన్నారు.